بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَ نُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V 06.12.2024 (Telugu)**

# హుదైబియా శాంతి ఒప్పంద నేపథ్యంలో
# మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర ప్రస్తావన

హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 06.12. 2024 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, లండన్, ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము

أَشْهَدُ أَنْ لَا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيْكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُوْلُهُ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ۔
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ۔ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ۔ الرَّحْمٰنِ الرَّحِيْمِ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ۔ اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ
نَسْتَعِيْنُ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ۔ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ۔

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు. హుదైబియా శాంతి ఒప్పంద ప్రస్తావనలో భాగంగా నేడు మరికొన్ని వివరాలను ప్రస్తావింతును.

సీరత్ ఖాతమున్నబియ్యీన్ పుస్తకంలో హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ గారు రజియల్లాహు అన్హు ఇట్లు వ్రాశారు. ఒప్పందాలలో లోపాలు ఉండిపోతాయి. వాటి ద్వారా కొన్ని సార్లు ముఖ్యమైన ఫలితాలు వెలువడుతాయి. ఈ ఒప్పందంలో కూడ ఒక లోపం ఈ విధంగా ఉండిపోయెను. ఈ ఒప్పందంలో ముస్లిం పురుషుల ప్రస్తావన స్పష్టంగా ఉండెను. కాని ముస్లిం స్త్రీల ప్రస్తావన లేకుండెను.

ఒప్పందం జరిగిన కొన్ని రోజుల తర్వాతనే కొందరు ముస్లిం స్త్రీలు మక్కా అవిశ్వాసుల నుండి తప్పించుకొని మదీనా చేరుకొనిరి. మృతి చెందిన మక్కా అన్యారాధకుడైన నాయకుడు ఉక్బ బిన్ అబీ ముయీత్ కూతురు ఉమ్మె కుల్సూమ్ వీరిలో మొదటి స్థానంలో ఉండిరి. తల్లి వరుసలో ఆమె హజ్రత్ ఉస్మాన్ అఫ్ఫాన్ (రజి)కు సోదరి అయ్యేవారు. ఉమ్మె కుల్సూమ్ చాలా ధైర్యంను ప్రదర్శిస్తు నడుచుకొంటూ సుదీర్ఘ ప్రయాణం చేస్తూ మదీనా చేరుకొనిరి. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు హాజరై తమ ఇస్లాంను వెల్లడించిరి. ఆమెను వెంబడిస్తు ఆమె ఇద్దరు బంధువులైన అవిశ్వాసులు మదీనా చేరుకొని, ఆమెను తిరిగి తమ వెంట పంపాలని అడిగిరి. వారిట్లు వాదించిరి. ఒప్పందంలో కేవలం పురుషుని పదం వ్రాయబడెను. కాని ఒప్పందం సాధారణమైనది. అందుకే స్త్రీ, పురుషులిరువురికి వర్తిస్తుంది. ఒప్పంద పదాలతో పాటు స్త్రీ బలహీనమై ఉన్నందున కూడ తిరిగి పోవడానికి ఉమ్మె కుల్సూమ్ సిద్ధంగా లేకుండిరి.

మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం స్వభావరీత్యా, న్యాయపరంగా ఉమ్మె కుల్సూమ్ పక్షాన తీర్పు వెల్లడించిరి. అదే రోజులలో ఈ సూక్తి అవతరించినది. ఎవరైనా స్త్రీ మక్కా నుండి మదీనాకు వచ్చినచో ఆమెను క్షుణ్ణంగా పరిశీలించండి, ఆమె పుణ్యాత్మురాలు, వినమ్రురాలని రుజువైనచో ఆమెను ఎట్టి పరిస్థితిలో తిరిగి పంపకండి. కాని ఆమె వివాహిత అయినచో ఆమె మెహెర్ (కన్యా శుల్కం)ను ఆమె అన్యారాధకుడైన భర్తకు తప్పకుండా చెల్లించండి.

ఒప్పందంలో ఒక షరతు ఇట్లుండెను. ఎవరైనా ముస్లిం పురుషుడు మక్కా నుండి మదీనాకు వచ్చినచో అతణ్ణి తిరిగి పంపవలెను. కాని ఎవరైనా పురుషుడు మదీనా నుండి మక్కాకు చేరుకున్నచో అతణ్ణి తిరిగి పంపుటకు అవిశ్వాసులు బాధ్యులు కాదు. బాహ్యంగా ఈ నిబంధన ద్వారా ముస్లింలకు అవమానం జరిగెనని భావించబడెను. కాని వాస్తవం ఇందుకు భిన్నంగా ఉండెను. ఆరంభంలోనే మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ఉపదేశించిరి. నిజమే! మదీనాను వీడి ముస్లింల నుండి విడిపోయిన వ్యక్తి దాంబికుడు, చెడిపోయిన అవయవం లాంటివాడు. అతణ్ణి తిరిగి మదీనాకు తీసుకొని రావలసిన అవసరమేముంది. ఒప్పందం జరిగి కొంత కాలం గడవగానే మక్కా నివాసుడైన అబూబసీర్ ఇస్లాం స్వీకరించి మదీనాకు చేరుకొనెను. కాని ఒప్పందం ప్రకారం అవిశ్వాసులు అడగగానే మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అతణ్ణి తిరిగి మక్కాకు పంపిరి. ఈ బృందం తన వెంట అతణ్ణి మక్కాకు తీసుకొని పోతుండగా మార్గమాధ్యలో అవకాశం లభించగానే బృంద నాయకుణ్ణి అబబసీర్ హతమార్చెను. రెండవ వ్యక్తి తప్పించుకొని మదీనాకు చేరుకొనెను. అతని వెనుకనే అబూబసీర్ కూడ మదీనాకు చేరుకొనెను. అబూబసీర్ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో ఇట్లు వేడుకొనెను. మీరు నన్ను అవిశ్వాసులకు అప్పగించిరి. కనుక మీ బాధ్యత ముగిసింది. కాని దేవుడు క్రూర జాతి నుండి నాకు మోక్షం ప్రసాదించెను. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఈ వ్యక్తి యుద్ధ అగ్నిని రాజేస్తున్నాడు. కావున మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎట్టి పరిస్థితిలోనైనా ఒప్పందం ప్రకారం నన్ను తిరిగి పోవాలని ఆదేశిస్తారని అబూబసీర్ భావించుకొని అతడు చెప్పాపెట్టకుండా మదీనా నుండి వెళ్లిపోయి, విడిగా తనకొక నివాసం ఏర్పరచుకొనెను. మక్కాలోని ఇతర బలహీన ముస్లింలకు విడిగా ఉన్న అబూబసీర్ నివాసం గురించి తెలియగా క్రమ క్రమంగా అక్కడ వారు ఏకమవ్వడం మొదలైరి. వారిలోనే మక్కా నాయకుడైన సుహైల్ బిన్ అమ్ర్ కుమారుడు అబూజందల్ కూడ ఉండెను. వీరి సంఖ్య (70) డెబ్బై మరికొన్ని కథనాలలో మూడు వందల వరకు ప్రస్తావించబడెను. ఈ విధంగా క్రమేణ మదీనాతో పాటు మరొక ముస్లిం రాష్ట్రం విడిగా ఏర్పడెను. ఈ ప్రాంతం సీరియా మార్గంలో ఉండెను. అందుకే ఈ ముస్లింలు తరచుగా అవిశ్వాసులతో పోటీపడేవారు. తద్వారా ఈ క్రొత్త పోటీ నుండి ఇబ్బందిని తట్టుకోలేక అవిశ్వాసులు స్వంతంగా ఒక దూతను పంపి ఈ ముస్లింలను కూడ మదీనాకు పిలిపించుకోవాలని మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో వేడుకొనిరి. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఉత్తరం అబూజందల్, అబూబసీర్‌కు చేరుకున్నప్పుడు అబూబసీర్ అనారోగ్యానికి గురై మంచం పట్టెను. వారెంతో ఉత్సాహంతో హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ ఉత్తరాన్ని హత్తుకొనిరి. అదే స్థితిలో వారు మృతి చెందిరి. కాని ఇతర ముస్లింలు మదీనాకు వచ్చేసిరి.

పశ్చిమ వ్యాఖ్యాతలు తమ అలవాటు ప్రకారం విమర్శిస్తారు. ఆయా విమర్శలలో ప్రస్తావించదగ్గ రెండు విమర్శలను హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ గారు (రజి) ఇట్లు వ్యాఖ్యానించిరి. వాటిలో మొదటి విమర్శ స్త్రీలను తిరిగి పంపుట గురించి ఉండగా రెండవ విమర్శ అబూబసీర్, అబూజందల్ సంఘటనల గురించి గలదు.

ఈ విమర్శలకు సమాధానంలో గుర్తుంచుకోవలసినదేమనగా: ఒకటి: మొదటి రోజు నుండి

ముస్లింలకు వ్యతిరేకంగా పోరాడుతున్న మక్కా అవిశ్వాసులు మరియు ముస్లింల మధ్య ఈ ఒప్పందం కుదిరెను. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎన్నడు ఒప్పందానికి విరుద్ధంగా ప్రవర్తించలేదని స్వయంగా అవిశ్వాసులు సాక్ష్యమిచ్చిరి. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రచార ఉత్తరం రోమ్ చక్రవర్తి హర్‌కల్‌కు అందినప్పుడు అవిశ్వాసుల నాయకుడు అబూసుఫ్యాన్ సీరియాలోనే ఉండెను. అతణ్ణి పిలిపించి ఇదే ప్రశ్న హర్‌కల్ అడిగెను. సమాధానంగా అబూసుఫ్యాన్ ఇట్లనెను. లేదు! ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎన్నడు ఒప్పందాలకు వ్యతిరేకంగా వ్యవహరించలేదు.

స్త్రీలను తిరిగి పంపు విమర్శ గురించి హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ గారు (రజి) సహీ బుఖారిలో వ్రాయబడిన పదాలను పొందుపర్చి ఇట్లు వ్రాసిరి. ఇంతటి స్పష్టమైన, షరతుల్లేని పదాలు ఉండగా ఇలాంటి విమర్శ చేయడం అన్యాయమే కాదు తీవ్రమైన అవినీతి అగుతుంది. చరిత్రలోని కొన్ని కథనాలలో ఒప్పంద పదాలలో “రజులున్” (పురుషుడు) అనే పదం లేదు. వాస్తవానికి సాధారణ పదాలే వ్రాయబడినవి. దానితో స్త్రీ, పురుషులిద్దరు భావించబడతారు. దీనికి సమాధానం ఇట్లు గలదు. “రజులున్” అనే పదం ప్రస్తావించిన గట్టి కథనంనకే మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును. రెండవదేమనగా చారిత్రక కథనాలలో వివిధ పదాలు వచ్చినవి. అవి కూడ ఇచట ప్రస్తావించిన విశ్లేషణ క్రారమే ఉన్నవి. ఉదా॥ సీరత్ ఇబ్నె హిశామ్‌లో వచ్చిన పదాలలో నిస్సందేహంగా పురుషుడు అనే పదం లేదు. కాని అన్ని సర్వనామాలు, క్రియలు పురుషులయే వ్రాయబడెను.

అబూబసీర్ సంఘటనకు సంబంధించిన రెండవ విమర్శ గురించి గమనించినచో ఇది కూడ నిరాధారమైన విమర్శ అని స్పష్టమగుతుంది. నిస్సందేహంగా మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ ఒప్పందం కుదుర్చుకొనిరి. కాని మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ ఒప్పందంను భంగపర్చిరా? అనే ప్రశ్న ఉత్పన్నమగుతుంది. భంగపర్చనే లేదు. వారు సల్లల్లాహు అలైహి వసల్లం అత్యంత గొప్ప రీతిలో ఈ ఒప్పందంను పాటించి ఆదర్శంగా నిలిచిరి.

గ్రహించండి! ఇస్లాం సత్యంను అంగీకరించి అబూబసీర్ మక్కా నుండి పారిపోతాడు, రహస్యంగా ఎవరి కంట పడకుండా మదీనాకు చేరుకుంటాడు. కాని అతని క్రూర బంధవులు అతణ్ణి వెంబడిస్తు మదీనాకు చేరుకొని అతణ్ణి ఖడ్గ సహాయాంతో బలవంతంగా తిరిగి తీసుకొని పోదలచిరి. ఇరువురు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సమక్షంలో చేరుకుంటారు. అబూబసీర్ గద్గద స్వరంతో మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను ఇట్లు వేడుకుంటాడు. దేవుడు నాకు ఇస్లాం వరంను ప్రసాదించెను, మక్కాకు తిరిగి వెళ్ళినచో దుఃఖం, బాధలతో కూడిన కాలం నా కండ్ల ముందుంది. ఇదంతా మీకు తెలుసు. దేవుని కొరకు నన్ను తిరిగి పంపకండి. రెండవ వైపు అబూబసీర్ బంధువులు ఒప్పందంను గుర్తు చేయిస్తారు. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మనసులో తీవ్ర బాధ ఉన్నను ఇటువంటి సమయంలో కూడ వారు సల్లల్లాహు అలైహి వసల్లం నీతి, నిజాయతిని పూర్తిగా పాటిస్తారు.

వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఓ అబూ బసీర్! మేము వారితో కదుర్చుకున్న ఒప్పందం గురించి నీకు తెలుసు. మన ధర్మంలో వాగ్దాన భంగం ధర్మబద్ధం కాదు. కావున! నువ్వు వీరితో తిరిగి వెళ్ళిపొమ్ము. నువ్వు సహనం, స్థిరత్వంతో ఇస్లాం మీద నిలబడినచో దేవుడు స్వయంగా నీ

కొరకు నీ లాంటి పీడితుల కొరకు మోక్షపు ఏదో ఒక దారి తెరుచును. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ ఆదేశం విని అబూబసీర్ తిరిగి వెళ్లిపోయెను. ఈ సంఘటన తర్వాతి వివరాలను బట్టి మక్కా నుండి బయటికి వెళ్ళిన వ్యక్తి ఎక్కడున్నా సరే అతణ్ణి వారు సల్లల్లాహు అలైహి వసల్లం తిరిగి మక్కాకు పంపుటకు బాధ్యులని విమర్శించుట తగదు. ఎందుకనగా ఇటువంటి విషయం ఒప్పందంలో లేనే లేదు. మదీనా రాజకీయ పరిధిలో లేని వ్యక్తులను కూడ మక్కాకు పంపుటకు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను బాధ్యునిగా చేయుట అవివేక విషయం. ఈ నిబంధనలను స్వయంగా మక్కా అవిశ్వాసులు నిర్ణయించారు. వారు పరచిన ముళ్ళులు వారికే కుచ్చుకున్నాయి. ఆ ప్రాంతంలో అబూబసీర్‌కు తోడుగా గుమికూడిన ప్రజలు మత పరంగా ముస్లిములే. కాని ప్రాపంచిక, రాజకీయ, ప్రభుత్వ, చట్ట రీత్యా వారి వారి సల్లల్లాహు అలైహి వసల్లంకు ఎలాంటి హక్కు లేకుండెను. వారు రాజకీయ పరంగా మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు లోబడి ఉండరనే నిబంధన స్వయాన అవిశ్వాసులే నిర్ణయించిరి. అవిశ్వాసులు స్వయంగా ఆయా ముస్లింలను మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం రాజకీయం నుండి తొలగించిన తర్వాత మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను ఎలా విమర్శిస్తారు. ఇది మక్కా అవిశ్వాసుల కుట్ర. అది వారిపైనే తిరగబడింది. పవిత్రమైన వారి సల్లల్లాహు అలైహి వసల్లం మనసు పవిత్రంగా ఉంది. వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఒప్పంద పదాలను కూడ పూర్తి చేస్తూ అబూబసీర్‌ను మక్కా వారికి తిరిగి అప్పగించి, మదీనా నుండి పంపించి వేసిరి. ఇలాగే వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఒప్పంద స్ఫూర్తిని కూడ పూర్తి చేసిరి. అతని సహచరులను తమ రాజకీయ పరిధిని బయటనే పెట్టిరి. కాని వీరు నిజాయతిగా వ్యవహరించకుండా ఇస్లాం, మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఉనికిని నిరాధారంగా విమర్శిస్తున్నారు.

ఖుత్బా జుమా చివరలో హుజూరె అన్వర్ ఇట్లనిరి. నేడు కూడ న్యాయమూర్తులమని ప్రకటించు కుంటున్నవారి ప్రమాణాలు రెండు నాలుకల ధోరణి కలిగి ఉన్నారు. నేడు ఇదే విషయం వలన ప్రపంచంలో అశాంతి ఏర్పడుతుంది. నేడు కూడ అల్లాహ్ తఆలా ప్రపంచంను మరియు ప్రత్యేకంగా ముస్లింలను ఈ మోసపూరిత (దజ్జాలీ) కుట్రల నుండి రక్షించుగాక! (ఆమీన్)

اَلْحَمْدُ لِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِیْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیْہِ۔ وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَیِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ یَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ یُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ۔ وَنَشْھَدُ اَنْ لَّآ اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ وَرَسُوْلُہٗ۔ عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہُ! اِنَّ اللّٰہَ یَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْھٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ وَالْبَغْیِ۔ یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ۔ اُذْکُرُوا اللّٰہَ یَذْکُرْکُمْ وَادْعُوْہُ یَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰہِ اَکْبَرُ۔

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*